## క్లుప్తంగా

### శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా...



సీఐకు జ్ఞాపిక అందజేస్తున్న పిచ్చేశ్వరరావు

అశ్వాపురం: మండలంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అశ్వాపురం నూతన సీఐ రవీందర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన సీఐ రవీందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ శ్రీనివాసరావు నూతన సీఐకు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. సీఐ రవీందర్‌ను బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో నాయకులు, ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు, పలు పార్టీలు, సంఘాల నాయకులు కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు జితేందర్, సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**సీఐ సేవలు మరువలేనివి..**

సీఐగా ఉత్తమ సేవలు అందించి రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన శౌర్య పథకం పొందిన అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు సేవలు మరువలేనివని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు మద్దెల అన్నపూర్ణ అన్నారు. బదిలీపై వెళ్తున్న సీఐ శ్రీనివాసరావును శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దిశ ఫౌండేషన్ జిల్లా నాయకులు లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

### భద్రాద్రి రక్షణకు శాశ్వత పరిష్కారం కావాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో గోదావరి వరదలు వచ్చినప్పుడు నిర్వహించే సమీక్ష సమావేశాలతో సమస్య తీరదని, భద్రాద్రి రక్షణకు శాశ్వత పరిష్కారం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సరేళ్ల నరేష్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది వరదల సమయంలో సీఎం కేసీఆర్ ప్రకటించిన నిధులతో భద్రాద్రికి గోదావరి వరదలతో శాశ్వత పరిష్కారం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో భోగాల శ్రీనివాసరెడ్డి, ఎడారి ప్రదీప్, రాము, నరేష్, సతీష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### మండలంలో ఆరు పునరావాస కేంద్రాలు

అశ్వాపురం: గోదావరి వరద ఉధృతి పెరిగితే మండలంలో గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ముందస్తుగా మండలంలో ఆరు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ ఎం.ఏ.రాజు తెలిపారు. మండలంలో ఆరు పునరావాస కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలో మొండికుంట కేవీఆర్ ఫంక్షన్ హాల్, సీతారాంపురం స్కూల్, చింతిర్యాలకాలనీ స్కూల్, అశ్వాపురం ఎస్‌కేటీ ఫంక్షన్ హాల్, మిట్టగూడెం స్కూల్, బీసీ హాస్టల్‌లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఏలు, స్కూల్ హెచ్‌ఎంలకు విధులు కేటాయించి పునారావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దని అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు.

### మొక్కలు నరికిన వారిపై కేసు

అశ్వారావుపేటరూరల్: అటవీ శాఖ ప్లాంటేషన్‌లో మొక్కలు నరికిన వ్యక్తులపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బి.రాజేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారాయణపురం ఫారెస్ట్ బీట్ పరిధిలో అటవీ శాఖకు చెందిన ప్లాంటేషన్‌లో సుమారు రూ.2.65లక్షల విలువగల 2,100 మొక్కల్ని గురువారం ఆసుపాక గ్రామానికి చెందిన మొడియం నాగేశ్, తిరుపతిరావు, లక్ష్మణ్‌రావు, ఆదిలక్ష్మి, పవన్, సీత, కారం చెన్నారావుతోపాటు మరికొంత మంది కలిసి నరికి వేశారు. ఈ మేరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వి.బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**గేదెల అపహరణపై..**

చర్ల: గేదెల అపహరణపై శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదైంది. ఎస్సై నర్సిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దుమ్ముగూడెం మండలంలోని తూరుబాక గ్రామానికి చెందిన కందుల నర్సింహారావు మే నెల 21న తన బంధువులతో కలిసి దైవదర్శనం కోసం కుటుంబ సభ్యులందరితో తిరుపతి వెళ్లాడు. తిరిగి మూడు రోజుల తరువాత ఇంటికి రాగా అతనికి చెందిన రెండు గేదెలు, ఒక దున్నపోతు కనపడలేదు. పలు ప్రాంతాల్లో వాటి కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

# దారి చూపండి సారూ..

- హైలెవల్ వంతెన నిర్మాణానికి 'లో లెవల్' తొలగింపు
- నాసిరకం పనులతో కొట్టుకుపోయిన అప్రోచ్ రహదారి
- నడవడానికే దారి లేక అవస్థలు

అశ్వాపురం: హై లెవల్ వంతెన నిర్మించాలని లోలెవల్ వంతెన తొలగించారు. గిరిజనులు నడవడానికి నాసిరకంగా అప్రోచ్ రహదారి నిర్మించారు. కానీ ఒక్క వర్షానికే తాత్కాలిక రహదారి కొట్టుకుపోయి కనీసం నడవడానికి కూడా దారి లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని గొందిగూడెం గిరిజన గ్రామంలో అశ్వాపురం–గొందిగూడెం రహదారిపై ఇసుకవాగుపై వంతెన నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరు కాగా ఇటీవల పనులు ప్రారంభించారు. రహదారిపై ఉన్న లోలెవల్ వంతెన తొలగించి హైలెవల్ వంతెన ప్రారంభించారు. వంతెన నిర్మాణానికి సుమారు ఆరునెలల పైనే పడుతుంది. వర్షాలకు వంతెన నిర్మాణం జరగక, నడవడానికి దారి లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ఎలాంటి ముందస్తు ఆలోచన లేకుండా గిరిజనుల రాకపోకలకు కాంట్రాక్టర్ వంతెన పక్కన నాసిరకంగా మట్టితో రెండు కల్వర్టు పైపులు వేసి అప్రోచ్ రహదారి నిర్మించారు. ఒక్క వర్షానికే చప్టా, తాత్కాలిక రహదారి కొట్టుకుపోయాయి. అశ్వాపురం–గొందిగూడెం రహదారిపై కనీసం కాలినడకన నడవడానికి కూడా దారి లేక గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గిరిజన గ్రామ పంచాయతీలలోని గ్రామాల గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసరమైతే గొందిగూడెం, తుమ్మలచెరువు, మొండికుంట మీదుగా సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణించి అశ్వాపురం వస్తూ గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొందరు వాగులో దిగి అవస్థలు పడుతూ వాగు దాటుతూ ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, కలెక్టర్ స్పందించి అప్రోచ్ రహదారి, చప్టా బందోబస్తుగా వర్షాలను తట్టుకునేలా నిర్మించి వర్షాకాలంలో మూడు నెలల పాటు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు. మట్టితో కాకుండా రాళ్లు, కంకరతో చప్టా నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదని గిరిజనులు పేర్కొంటున్నారు.



కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి





అవస్థలు పడుతూ వరద నీటిలో వెళ్తున్న ప్రజలు

# తగ్గిన వాన.. ఆగని వరద

అల్పపీడనంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వాన శుక్రవారం కొంత తగ్గుముఖం పట్టింది. కానీ కురిసిన వర్షాలకు వాగులు, చెరువులకు భారీగా వరద చేరింది. ఈ మేరకు వాగులు, చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల లోలెవల్ చప్టాలు, బ్రిడ్జిలపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అధికారులు కలగజేసుకుని ప్రమాదాలు చోటు చేసుకోకుండా రాకపోకలు నిలిపివేసి ప్రజలను అప్రమత్తం చేశారు. - సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేట రూరల్: తొమ్మిది అడుగులకు చేరిన పెదవాగు నీటి మట్టం



అశ్వారావుపేట: అలుగు పోస్తున్న అంకమ్మచెరువు



వాగొద్దుగూడెం చప్టాపై పారుతున్న వాగు



అన్నపురెడ్డిపల్లి: అబ్బుగూడెం, కట్టుగూడెం మధ్య నిలిచిపోయిన రాకపోకలు



దమ్మపేట: రహదారిపై నిలిచిన వరద నీరు



పినపాక: జానంపేటలో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

# వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి



వైద్యశాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

చర్ల: వైద్య రంగంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని అందులో భాగంగానే చర్ల ప్రభుత్వ వైద్యశాల ఈ విధంగా అభివృద్ధికి నోచుకుందని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. చర్ల మండలంలోని గోదావరి ముంపు ప్రాంతాలను సందర్శించేందుకు మండలానికి వచ్చిన ఆయన ముందుగా తేగడలోని హైలెవల్ వంతెన వద్ద నుంచి గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం చర్ల ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. ఇటీవల నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రసూతి వార్డు, నవజాత సంరక్షణ కేంద్రంతో పాటు మరమ్మతులు పూర్తయిన సీమాంక్ సెంటర్లను పరిశీలించి ఇంకా ఉన్నా సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ వైద్యశాల ప్రారంభానికి త్వరలోనే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావును ఆహ్వానిస్తామన్నారు. ఈయన వెంట డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, తహసీల్దార్ భరణిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, కేశవాపురం సర్పంచ్ నాగేంద్ర, నాయకులు అజీజ్, వరప్రసాద్, సీతాపతిరాజు, రాజబాబు, మాధవరావు ఉన్నారు.

**వరద బాధితులకు అండగా..**

గోదావరి వరద ముంపు బాధితులందరికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా ఉంటారని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. దుమ్ముగూడెం మండలంలోని సున్నంబట్టి గ్రామాన్ని ఆయన సందర్శించి వరద పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అక్కడి ముంపు బాధితులతో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో గోదావరి వరదలతో ఎలాంటి నష్టం వాటిల్లకుండా సీఎం కేసీఆర్ చర్యలు చేపడతారన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

## రైతుబీమా దరఖాస్తులు స్వీకరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కావడిగుండ్ల, నారాయణపురం, కోయ రంగాపురం గ్రామాల్లో శుక్రవారం రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. స్థానిక ఏఓ నవీన్ ఆధ్వర్యంలో ముందుగా ఆయా గ్రామాల్లోని రైతులతో సమావేశాలను ఏర్పాటు చేసి రైతుబీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అందిస్తున్న రైతుబీమాకు అర్హులైన రైతులు తప్పనిసరిగా వచ్చే నెల5 లోపు దరఖాస్తులు ఏఈవోలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఓలు షాకిరా భాను, రాయుడు పాల్గొన్నారు.

## నేడు కాంగ్రెస్‌లో చేరిక



మాట్లాడుతున్న జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: అశ్వారావుపేట సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరికలు జరుగనున్నట్టు పార్టీ నాయకులు జారే ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం పార్టీ నాయకులు జూపల్లి రమేష్‌బాబు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీలో చేరే వారికి మాజీ ఎంపీ, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తారని తెలిపారు. నాయకులు రమేష్‌బాబు, ప్రమోద్, నండ్రు రమేష్‌బాబు, ఉపేందర్ పాల్గొన్నారు.

## ముందస్తు చర్యలు అంటే ప్రచారం కాదు..

భద్రాచలంఅర్బన్: ముందస్తు చర్యలు చేపట్టడం అంటే ప్రచారం కాదని, నిధుల కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భద్రాచలం నియోజకవర్గం కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భద్రాచలం పట్టణంలోని ముంపు ప్రాంత కాలనీలను, పునరావాస కేంద్రాలను సీపీఎం బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గోదావరి కరకట్ట పొడిగించడానికి కావాల్సిన నిధులు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్క పెడుతోందని విమర్శించారు. కరకట్ట స్లూయిజులు, లాకులు రిపేరు, నీటిని తోడేందుకు పెద్ద మోటార్లు ఏర్పాటుకు రూ.కోటి 30 లక్షల రూపాయలు ఖర్చు అవుతాయని ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నేటికీ ఒక్క మంజూరు కాలేదని అధికారులు వాపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు భీమవరపు వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, పి. సంతోష్ కుమార్, స్థానిక నాయకులు ధనకొండ రాఘవయ్య, శ్రీనివాస్, సతీష్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

# నిందితులను కఠినంగా శిక్షించాలి

భద్రాచలంఅర్బన్: మణిపూర్ రాష్ట్రంలో అత్యంత పాశవికంగా గిరిజన మహిళను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఏఎంసీ కాలనీలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ అధ్యక్షురాలు ఉస్తేల జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి డి. సీతాలక్ష్మి మాట్లాడగా అల్లాడ సత్యవతి, మీడియం రమణ, లక్ష్మి, ముత్యాలు, సరోజినీ, లత, జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

**బీఏఎస్ ఆధ్వర్యంలో...**

మణిపూర్ ఘటన నిందితులను శిక్షించాలని కోరుతూ భద్రాచలం ఆదివాసీ సమితి(బీఏఎస్) కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నిరసన చేపట్టి బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. భద్రాచలం ఆదివాసీ సమితి అధ్యక్ష, కార్యదర్శి పూనెం కృష్ణ దొర, అడ్వకేట్ పాయం రవి వర్మ, ఆదివాసీ హెల్త్, మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీసాల కృష్ణయ్య, నాయకులు చల్లగుల్ల నాగేశ్వరరావు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



భద్రాచలంఅర్బన్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

చర్ల: మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు జరుగుతుండడం హేయమైన చర్యలని, వీటిని యావత్ ప్రజానీకం ఖండించాలని ఆదివాసీ సేనా కన్వీనర్, న్యాయవాది కారం రమేష్ అన్నారు. శుక్రవారం దుమ్ముగూడెం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, ప్రపంచంలో ఎక్కడి దాడులు జరిగినా మహిళలపై అత్యాచారాలు జరిగినా అవి ఆదివాసీలపైనే జరుగుతున్నాయన్నారు. మణిపూర్‌లో ప్రస్తుతం ఇదే జరుగుతోందని వెంటనే అక్కడి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## 'గృహలక్ష్మి' ఇళ్లు ఇవ్వాలి

చర్ల: దుమ్ముగూడెం మండలంలో అర్హులైన వారందరికీ గృహలక్ష్మి పథకం ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో తహసీల్‌లో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీఏజీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడారు. తక్షణమే ఇళ్ల మంజూరుకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చంద్రయ్య, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు నాగలక్ష్మి, కారం దారయ్య, వెంకటేష్, సావిత్రి, నాగమణి పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అశ్వాపురం: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు సీజనల్, అంటు వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు ఎంపీపీ ముత్తినేని సుజాత సూచించారు. అమ్మగారిపల్లి, కుమ్మరిగూడెం, చింతిర్యాల గ్రామాలను శుక్రవారం సందర్శించారు. గోదావరిలో జాలర్లు పడవలతో గతేడాది చేసిన పనులకు ఇంకా డబ్బులు రాలేదని విన్నవించగా తహసీల్దార్‌తో మాట్లాడి త్వరలో ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా, మండల కో ఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కే.ఖదీర్, ఎంపీటీసీ కమటం నరేష్, రమేష్‌బాబు, యక్కటి పున్నారెడ్డి, పర్వత నరేష్, సతీష్, పాల్గొన్నారు.

## జీఎంలకు సన్మానం



సన్మానిస్తున్న జీఎం రామచందర్

మణుగూరు రూరల్ : సింగరేణి సంస్థలో పనిచేసి త్వరలో పదవీ విరమణ పొందుతున్న జీఎం(ఈఅండ్ఎం) సెంట్రల్ వర్క్‌షాప్ ఎల్‌వీ గణపతిరావు , జీఎం కార్పొరేట్‌లు సి.స్వామి నాయుడు, జి.సూర్యకుమార్‌లను మణుగూరు ఏరియా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్, ఎస్ఓటు జీఎం కృష్ణయ్య, ఏజీఎం(సివిల్) వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్స్ నర్సిరెడ్డి, ఏఎస్ఓ వెంకటరమణ, కెపియుజి ఏజెంట్ వీరభద్రరావు, డీజీఎంలు రమేష్, వెంకట్రావు, శ్రీనివాసమూర్తి, వెంగళరావు, అనురాధ, ప్రాజెక్ట్ ఇంజనీర్లు వీరభద్రుడు, రవీందర్, సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, పర్యావరణ అధికారి శ్రీనివాసరావు, సీనియర్ ఎస్టేట్ అధికారి బాబుల్ రాజు పాల్గొన్నారు.

## 28 నుంచి అమరవీరుల వారోత్సవాలు

చర్ల: జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించాలని మావోయిస్టు పార్టీ మణుగూరు పాల్వంచ ఏరియా కమిటీ కార్యదర్శి సూర్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన పేరిట శుక్రవారం ఒక లేఖ విడుదలయ్యింది. గ్రామ గ్రామాన సమరోత్సాహంతో అమరులను స్మరించుకుంటూ ఉత్సవాలను నిర్వహించి ఘనంగా నివాళులర్పించాలని కోరారు.

# మంజూరు పోస్టులు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

మణుగూరు రూరల్: బీటీపీఎస్‌లో మంజూరు పోస్టులను భర్తీ చేయాలని కార్మిక సంఘం -1535 కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, జెన్‌కో రాష్ట్ర అధ్యక్షుడు పి.రాము డిమాండ్ చేశారు. శుక్రవారం ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... బీటీపీఎస్‌లో శాంక్షన్ పోస్టులు లేకపోవడంతో ఉద్యోగులకు పదోన్నతులు లభించడం లేదన్నారు. డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ నిర్వహించడంలో ఆలస్యం జరుగుతోందన్నారు. వెంటనే డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీని నిర్వహించి. ఉద్యోగులకు డస్ట్, కోల్ అలవెన్స్ మంజూరు చేయాలని కోరారు. పలు ప్రదేశాల్లో తాగునీటి, లంచ్ రూములు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బీటీపీఎస్ సీఈ బిచ్చన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.ప్రసాద్, ఎం.రాజ మనోహర్, నాయకులు నరసింహారావు, ప్రకాష్, రాంబాబు, వెంకటేశ్వర్లు, సిద్దుల హుస్సేన్, రఫీ, రామ్‌చందర్, రవి, సుభాని, శ్రీహరి పాల్గొన్నారు.

## విశ్వకోయ గోండు భాషా దినోత్సవం

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం విశ్వ కోయ, గోండు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన నాయకులు కల్లూరి కొర్రాజు భాషల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌పీ కన్వీనర్ రేసు ఆదినారాయణ మూర్తి, ఉపసర్పంచ్ కొర్సా రామచంద్రయ్య, జీఎస్‌పీ ఉపాధ్యక్షుడు ముర్రం వీరభద్రం, కల్లూరి ప్రసాద్, కనితి ముత్తయ్య, కొర్సా వీరభద్రం, ఇర్పా ముద్దరాజు, కొర్సా సత్యనారాయణ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు ఆహారం పంపిణీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని నన్నపునేని మోహన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రంలో ఉన్న వరద బాధితులకు, పారిశుద్ధ్య కార్మికులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేబినెట్ ప్రెసిడెంట్ లయన్ మైనేని మోహనరావు ఆహారం పంపిణీ చేశారు. భద్రాచలం మండల ఆర్ఐలు బీక్కులాల్ నాయక్, నరసింహారావు, క్లబ్ కొత్తగూడెం అధ్యక్షుడు లయన్ షేక్ దస్తగిరి, కార్యదర్శి లగడపాటి రమేష్, కోశాధికారి చెరుకు శ్రీనివాస్, జిల్లా కేబినెట్ చైర్ పర్సన్ మన్నేం జవహర్ రెడ్డి పాల్గొన్నారు.

## సందడిగా గోదావరి తీరం

భద్రాచలంటౌన్: ఎగువ ప్రాతాలలో కురిసిన వర్షాలతో గోదావరికి భారీగా వరద నీరు రావడంతో స్థానికులు, పర్యాటకులు గోదావరి పరవళ్లను తిలకించేందుకు ఆసక్తి కనబరిచారు. దీంతో గౌతమి నదీ తీరంలో శుక్రవారం సాయంత్రం స్థానికులు, పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. భారీ వర్షాల కారణంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో తల్లిదండ్రులు చిన్నారులు గోదావరి అందాలను చూపించేందుకు తీసుకురావడంతో గోదావరి కరకట్టపై ఆహ్లాదవాతావరణం నెలకొంది. ఆంక్షలతో కరకట్టపై పూర్తి స్థాయిలో పర్యటించేందుకు పోలీసులు అనుమతించలేదు.



గోదావరి ఉధృతిని వీక్షిస్తున్న పర్యాటకులు

# యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంఅర్బన్: వర్షాలు, వరదలతో పాటు పంచాయతీ కార్మికుల సమ్మె వల్ల భద్రాచలం పట్టణంలో భారీగా పేరుకుపోయిన చెత్త విషయంలో 'వీధి వీధినా చెత్తకుప్పలు' శుక్రవారం సాక్షి లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు చెత్తను తొలగించేందుకు శుక్రవారం సుమారు 400 మంది తాత్కాలిక సిబ్బందిని అధికారులు ఏర్పాటు చేశారు. భద్రాచలంలోని ముంపు ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య చర్యలను చేపట్టారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో ఎక్కడికక్కడ నిలిచిన మురుగు, చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా తరలించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టిన అనంతరం వీధులు, రోడ్ల పైన బ్లీచింగ్ చల్లారు. అడిషనల్ కలెక్టర్, డీఆర్డీఏ పీడీ మధుసూదన్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్, భద్రాచలం మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మీతో పాటు జిల్లాలోని పలు మండలాలకు చెందిన పది మంది ఎంపీఓలు, 40 మంది పంచాయతీ కార్యదర్శులు దగ్గరుండి పర్యవేక్షించారు.



చెత్త తొలగిస్తున్న తాత్కాలిక సిబ్బంది